క్లుప్తంగా

పాలసముద్రంలో వర్షం



జోరుగా పడుతున్న వాన

పాలసముద్రం : మండలంలో ఆదివారం సాయంత్రం గాలీవానతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు మామిడి, సపోట పూత, పిందెలు నేలరాలాయి. రెండు, మూడు రోజులుగా ఎండల తీవ్రత తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ వర్షంతో కాస్త ఉపశమనం చెందారు. మామిడి, సపోట తోటల్లో పిందెలు రాలిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది.

జీడీనెల్లూరు ఎస్‌ఐ బదిలీ

గంగాధరనెల్లూరు: స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల జీడీనెల్లూరు విశ్రాంత వీఆర్వో, వైఎస్సార్‌సీపీ నేత రవీంద్రనాథ్‌రెడ్డి పట్ల ఎస్‌ఐ శ్రీనివాసరావు దురుసుగా ప్రవర్తించిన విషయం విదితమే. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఎస్‌ఐ వ్యవహరించిన తీరు తప్పని నిర్ధారించి వీఆర్‌కు పంపారు. ఏఎస్‌ఐ గజేంద్ర, కానిస్టేబుల్ వినోద్‌కుమార్‌ను ముందస్తుగా బదిలీ చేశారు.

నింద్ర ఎస్‌ఐగా శివశంకర్



నింద్ర: మండల ఎస్‌ఐగా శివశంకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న వెంకట సుబ్బమ్మ బదిలీపై వెళ్లడంతో నగరిలో పని చేస్తున్న ఎస్‌ఐ శివశంకర్ నింద్రకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



సుబ్రమణ్యం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లెకు చెందిన వృద్ధుడు కే.సుబ్రమణ్యం(74) నెల రోజులుగా కనిపించడం లేదని కుమారుడు జేమ్స్ ఆదివారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు ఇంటికి రాలేదని వివరించాడు. తన తండ్రి కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదన్నాడు. అయితే పింఛన్ కోసం వస్తాడని ఎదురుచూసినా రాకపోవడంతో ఏమయ్యాడోనని పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ తెలిస్తే సెల్ నంబర్ 9177551074 కు సమాచారం అందించాలని కోరాడు.

ఎస్‌ఐ లోకేష్‌కు సత్కారం



ఎస్‌ఐ లోకేష్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెదురుకుప్పం: వెదురుకుప్పం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన లోకేష్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. గతంలో ఎస్‌ఐగా ఉన్న గోపి బదిలీ అవడంతో చిత్తూరులో వీఆర్‌లో ఉన్న లోకేష్‌ను వెదురుకుప్పం ఎస్‌ఐ గా నియమించారు. ఆదివారం విధుల్లో చేరిన ఆయనను వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

వృషభ వాహనంపై కరకంఠేశ్వరుడు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం కరకంఠేశ్వర స్వామి నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా రూ.1.80 లక్షల వ్యయంతో నూతన వృషభ (నంది) వాహనాన్ని ఆలయానికి గతంలో అందించారు. ఆ వాహనాన్ని తొలిసారిగా బ్రహ్మోత్సవాల్లో వినియోగించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమానికి చంద్రారెడ్డి, వెంకటరత్నం రెడ్డి, బీడీ భాస్కర్, ఇందారెడ్డి, మునికృష్ణారెడ్డి, రమేష్ రెడ్డి, గిరిజాకుమారి, సూర్యారెడ్డి, ఎల్లప్పరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

నేటి నుంచి ఉచిత నేత్ర శిబిరం

- నగరిలోని మంత్రి రోజా క్యాంపు కార్యాలయంలో వైద్య శిబిరం
- రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయ సంయుక్తంగా శిబిరం ఏర్పాటు
- 8 రోజుల పాటు వైద్యసేవలు
- కంటి పొర ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్
- ప్రఖ్యాతి గాంచిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా చికిత్స



మొబైల్ కంటి ఆపరేషన్ వాహనం వద్ద మంత్రి ఆర్కే రోజా

నగరి : కంటి సమస్యలు ఉన్నవారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలు ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా భారీ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రోజా చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించనున్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరం ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనుంది. నగరి చరిత్రలో ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా 8 రోజుల పాటు నియోజకవర్గ ప్రజలకు కంటి సంబంధిత జబ్బులకు ఉచిత వైద్యచికిత్స అందించనున్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ వాహనం ద్వారా మైక్రో స్కోపిక్ స్మాల్ ఇన్‌సిషన్ అనే కొత్త పద్ధతిలో ఆపరేషన్ చేయనున్నారు. ఆపరేషన్ చేసేవారికి ఆపరేషన్‌తో పాటు ఐఓఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించనున్నారు. కంటి ఆపరేషన్ చేసుకున్న వారు ఆపరేషన్ జరిగిన రెండు గంటలలో ఇంటికి వెళ్లేందుకు అంబులెన్స్ సర్వీసు ఏర్పాటుచేశారు. అత్యంత ఖర్చుతో ఏర్పాటుచేస్తున్న ఈ వైద్యశిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శిబిర నిర్వాహకులు కోరుతున్నారు. చికిత్సకు విచ్చేసే వారు నగరి మున్సిపాలిటీకి చెందిన వారైతే 9030571715 నంబరుకు, నగరి మండలానికి చెందిన వారైతే 9398520622 నంబరుకు, పుత్తూరు మున్సిపాలిటీ అయితే 9493565747 నంబరుకు, పుత్తూరు రూరల్ మండలం అయితే 9866881427 నంబరుకు, విజయపురం మండలం అయితే 6305896004 నంబరుకు, నింద్ర మండలం అయితే 9866142258 నంబరుకు, వడమాలపేట మండలం వారు 9948871188 నంబరులో సంప్రదించాలన్నారు.



మంత్రి క్యాంప్ కార్యాలయంలో వైద్య పరికరాలు

కంటి చికిత్సకు విచ్చేసేవారు తీసుకురావలసినవి

- ఆధార్ కార్డు జిరాక్స్
- ఫోన్ నంబరు
- బీపీ, షుగర్ ఉన్నవారు వారు నిత్యం వాడే మందులు తీసుకురావలెను

కంటివైద్య శిబిరం పరిశీలన

కంటి వైద్య చికిత్స నిమిత్తం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మొబైల్ కంటి శస్త్రచికిత్స వాహనాన్ని, కంటి పరీక్షలకు వినియోగించే పరికరాలను మంత్రి ఆర్కేరోజా, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ 8 రోజుల పాటు వైద్య శిబిరం జరుగుతుందని, అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్, చికిత్స చేయబడుతుందన్నారు. కంటిపొర ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్ చేసి, అద్దాలు, మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సువర్ణ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



చిన్నారిని ఆశీర్వదిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి మనవరాలికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి యశ్విక అని నామకరణం చేసి దీవించారు. ఆదివారం మండల పర్యటనకు విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా గురవారెడ్డికి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యుల కోరిక మేరకు చిన్నారికి యశ్విక అని నామకరణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం కిట్లను అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తోందని, పిల్లలు ఎదుగుదలకు, వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ మండల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సిద్ధం



పరీక్ష కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లోకేష్



పరీక్ష సామగ్రితో పాటు హాల్ టిక్కెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్

వడమాలపేట : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం అవుతున్నాయి. మండల కేంద్రంలోని బాలుర, బాలికల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈఓ పద్మావతి తెలిపారు. సోమవారం ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించమని చెప్పారు. బాలుర పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 118, సప్లిమెంటరీ ముగ్గురు, బాలికల పాఠశాలలో రెగ్యులర్ 107, ముగ్గురు సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: నేటి నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ రాజేంద్రన్ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గంగాధరనెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 318 మంది విద్యార్థులు, నెల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 208 మంది విద్యార్థులు, తూగుండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 177 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని, తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో జరగనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ లోకేష్ ఆదివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతులపై హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మంచి మార్కులు సాధించండి

పాలసముద్రం : పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను బాగా రాసి మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. ఆదివారం పాలసముద్రం దళితవాడలో పదో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే పదో తరగతి పబ్లిక్ పరీక్షలే తొలిమెట్టు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఆయన పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈసారి 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు మంచి బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం ఆయన, స్కూల్ హెచ్‌ఎంతో కలిసి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, హాల్‌టికెట్లు పంపిణీ చేశారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి



మంత్రి రోజాకు వినతిపత్రం అందిస్తున్న కరివరదరాజ స్వామి ఆలయ కమిటీ సభ్యులు

నగరి : కరివరదరాజ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలంటూ ఆలయ కమిటీ సభ్యులు మంత్రి ఆర్‌కే రోజాకు వినతిపత్రం అందించారు. ఆదివారం మంత్రిని కలిసిన వారు ఆలయానికి కల్యాణ మండపం నిర్మించాలని, బ్రహ్మోత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఆలయ సందర్శనకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సత్రవాడ ఆలయం వద్దకు వచ్చేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఆలయ అభివృద్ధికి తప్పక సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీఎం రామచంద్రన్, సభ్యులు రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా చేనేత అనుబంధ సంఘం అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, ఈకే అయ్యప్పన్, జగన్నాథం, బాలాజి పాల్గొన్నారు.

మనోధైర్యంతో జీవించాలి



పృథ్వీరాజ్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయినా మనోధైర్యంతో జీవితాన్ని కొనసాగించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ పాత్రికేయుడు శంకర్ తల్లి భారతిదేవి మృతి చెందారు. విషయం తెలిసి రామ్‌ప్రసాద్‌రెడ్డి వారి ఇంటికెళ్లి మృతహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

వడమాలపేటలో..

వడమాలపేట: మండల వైస్ ఎంపీపీ ఉపేంద్ర బావమరిది పృథ్వీరాజ్ ఇటీవల బెంగళూరులో ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అయితే శనివారం అర్ధరాత్రి ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఆదివారం ఎస్వీపురంలో పృథ్వీరాజ్ మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. విషయం తెలిసి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎస్వీపురం చేరుకుని పృథ్వీరాజ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యులు సురేష్‌కుమార్ రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. స్వామి వారు ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. అదేవిధంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ఆవరణలో సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మొదటి రోజు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు తెప్పలను అధిరోహించి శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు తిరుగుతారు.

నేటి నుంచి కొలుపు మహోత్సవం



కొలుపు ఉత్సవానికి సిద్ధమైన మూర్తెమ్మ గొల్లగంగమ్మ దేవాలయం

పాలసముద్రం : మండలంలోని గొల్లకండ్రిగ గ్రామంలో వెలసిన మూర్తెమ్మ గొల్లగంగమ్మ 11వ వార్షిక కొలుపు మహోత్సవం సోమవారం నుంచి జరుగుతుందని ఆలయ ధర్మకర్త నాగరాజ్ యాదవ్(నాగేష్) ఆదివారం తెలిపారు. కొలుపు మహోత్సవాల భాగంగా సోమవారం ఉదయం గెరి గె ప్రతిష్ట, సాయంత్రం బియ్యపు కొలత, ముడు పులు కట్టుట, అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపారాధన జరుగుతాయన్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గొల్లగంగమ్మ గెరిగె ఊరేగింపు, పొంగళ్లు పెట్టుట, రాత్రికి పంబలవారి కథ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం అమ్మవారికి తొమ్మిది బిందెల పాలు, పసుపు నీరు, పెరుగుతో వివిధ అభిషేకాలు చేసి అమ్మవారి ఎదుట బొమ్మవేసి ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, తరువాత పొంగుపాలు తోడుట కార్యక్రమం జరుతుందన్నారు. అమ్మవారి కొలుపు మహోత్సవానికి విచ్చేస్తున్న భక్తులకు ఆలయ ధర్మకర్త నాగరాజు యాదవ్ మర్యాద పూర్వకంగా ఆహ్వానించి వారికి అమ్మవారిని దర్శనభాగ్యం కల్పిస్తారు. గొల్లకండ్రిగ, కొత్తకండ్రిగ, ఆముదాల, జయలక్ష్మీపురం, యంయం కండ్రిగ, వీఎస్ కండ్రిగ గ్రామస్తులతో పాటు మండల్యవాప్తంగా ప్రజలు అమ్మవారి కొలుపు మహోత్సవాకి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ధర్మకర్త తెలిపారు.

ఘనంగా మట్టల పండుగ



మట్టలతో ఊరేగింపుగా వెళుతున్న క్రిస్టియన్లు

కార్వేటినగరం: పవిత్రమైన మట్టల పండుగను క్రిస్టియన్లు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలోని బేతేలే షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం పాస్టర్ మాట్లాడుతూ ఏసుప్రభువు గాడిదపై ఊరేగుతూ ప్రజలకు ఉపదేశం చేశారని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా శిలువతో పాటు ఈత ఆకులకు పుష్పాలు గుచ్చి, ఏసుప్రభువు కీర్తనలను ఆలపిస్తూ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అలాగే చర్చి ఆవరణలో అన్నదానం చేపట్టారు. అలాగే కొల్లాగుంట సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ రాజ్‌కుమార్, అలాగే కార్వేటినగరం నాలుగురాళ్ల వద్ద ఉన్న యెహోవా ఈరో చర్చిలో పాస్టర్ సరోజినీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా కొల్లాగుంట సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో మేరిమాత, భటుల వేషధారణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ పాల్, వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

పాలసముద్రం : మండలవ్యాప్తంగా ఆదివారం చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండుగ జరుపుకున్నారు. ఆముదాల సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ రెవరెంట్ పాల్‌వెంకటేష్, ఉపదేశకులు విలియం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈస్టర్ పండుగ గురించి తరవుగా వివరించారు. ఈ ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ఊరేగింపు నిర్వహించారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం


చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం పాతపేటకు చెందిన రాజులగారి చిన్నబ్బ కుమారుడు శంకర్ రెడ్డి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. నగదును ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్ప సోయగం





విరబూసిన పుష్పాల వద్ద తీయని జ్ఞాపకాలను చిత్రీకరిస్తున్న భక్తులు









కలియుగ వైకుంఠం తిరుమలలోని ప్రతి వస్తువు, చెట్లు, చేమల్లోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. ఇక్కడున్న పలు చెట్లు ఆకులు రాలిపోయి కొత్త చిగుర్లు వేశాయి. కొన్ని నిండుగా పూలతో పరిమళాలను వెదజల్లుతున్నాయి. రోడ్ల పక్కన, నందన వనాల్లో ఉన్న చెట్లు పూలతో నూతన శోభను సంతరించుకుని హొయలుపోతున్నాయి. వాటిని చూసి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. కొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని మురిసిపోయారు. – తిరుమల

తిరుమలలోని పలు ప్రాంతాలలో భక్తులను కనులవిందు చేస్తున్న పుష్పాలు